దానం

యం. ఉమామహేశ్వర రావు

వాలు కుర్చీలో కూర్చుని వీధివేపు చూస్తున్నాడు మునసబునాయుడు.

అతని ప్రక్కనే ఆ ఊరి బారికాడు వెంకన్నచేతుల్ని కట్టుకుని మౌనంగా నించున్నాడు.

మునసబునాయుడినోట్లో లంక పొగాకు చుట్ట కాల్తోంది. తెల్లటి పొగ బయటకు గాల్లోకి వదుల్తూ ఒక కాలిమీద మరో కాలు వేసుకుని విలాసంగా చుట్ట కాల్చసాగేడతను.

కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్న నాయుడు వీధి గేటు తలుపు 'కిర్రున' చప్పుడైతే కళ్ళు తెరచి చూసేడు. గేటు తలుపు తోసుకుని వస్తున్న పంచాంగం పంతులు అవధాన్లు కనిపించాడు. మనిషి సన్నగా, రివట కర్రలా ఉన్నాడు. మాసిపోయిన గావంచా కట్టుకుని యింత విభూతి నామంతో అపర కుచేలుడి పోజులో కనిపించిన అవధాన్లును చూడగానే మునసబు నాయుడికి అంతవరకూ లోపల దాగిన కోపం కట్టలు త్రెంచుకుని బయటకుబికింది. లేడిమీదకు పంజా విప్పి దుముకబోతున్న పెద్దపులిలా విరుచుకు పడ్డాడు.

"ఏవయ్యా పంతులూ !... ప్రొద్దుటవగా రమ్మని కబురుపెడితే యిప్పుడా తీరుబడిగా రావడం ? మునసబు కబురెడితే నిక్కుతూ — నీల్గుతూ వచ్చేవంటే నీ యవ్వారమేటో, నీ పొగరేటో తేల్చవలసిందే !"

ఉరుములతోకూడిన పిడుగుల వర్షంలా పడిన నాయుడి కోపశరాలకు తడబాటుపడుతూ ఒకింతసేపు వణికిపోయాడు పాపం అవధాన్లు. క్షణకాలం నోటివెంట మాట రాలేదు. చివరకు ఎలాగో తేరుకున్నాడు.

"తమరు కబురుపెట్టిన వేళకు యింటి వద్ద లేనండీ !! అలా ఊళ్ళోకి కాస్త వెళ్ళేనండి



వెళ్ళడం జరిగింది. ఇప్పుడే తిరిగి వచ్చాను. మీరు కబురుపెట్టేరని కబురు తెలిసీ, తెలీడంతో పరిగెత్తుకొచ్చాను.''

ఎంతో వినయంగా అన్నాడు మునసబుతో.

మునసబు అతనికేసి దీర్ఘంగా ఓసారి చూసేడు. ''అసలు ఈవేళ నిన్నెందుకు రమ్మని కబురు పెట్టేనో తెలుసా ? '' హూంకరించాడు.

''తెలీదు. పెద్దలు మీరే సెలవియ్యాలి !'' చేతులు రెండూ జోడిస్తూ అన్నాడు అవధాన్లు.

''నీకు తెలీదయ్యా, తెలీదు ... నీ పొగరుబోతు ఆవును ఊళ్ళోవాళ్ల పొలాలమీదకు విప్పి వదిలేయడం తెలుసు. దానికింత మేత కడుపు నిండా పెట్టలేనివాడివి దాన్నెందుకు కొన్నావు?'' నాయుడీసారీ మళ్లీ హూంకరించాడు చుట్టకొసను కిసుక్కున కొరికి బయటకు ఊస్తూ.

ఎండుటాకులా గజగజలాడేడు అవధాన్లు.

''క్ష మిం చం డి మునసబుగారూ ! నా ఆవును ఊరివాళ్ల పొలాలపైకి విప్పి ఎప్పుడూ తోలలేదు నేను. కట్టిన త్రాడును తెంచుకుని అది వెళ్లిపోతే తిరిగి తిరిగి పట్టుకుని యింటికి తెచ్చుకుంటున్నాను. బ డు గు వాణ్ణి. బీద బ్రాహ్మణ్ణి. ఏదో ఇంట్లో వాడుకుందుక్కోసం పాలచుక్కలకు పనికొస్తుందన్న ఉద్దేశ్యంతో ఎవరో మీ వంటి మహానుభావులు దానమిస్తే స్వీకరించాను'' అన్నాడు అవధాన్లు.

ఈ సమాధానంతో మునబుకు చిరాకు పెరిగింది.

''ఆపవయ్యా ! ఆపు. ఇప్పుడు నువ్వు ఆ ఆవును ఏ ఉద్దేశ్యంతో, ఎవరిదగ్గర, ఎలా స్వీకరించావో నాదగ్గర రికార్డు వెయ్యక్కర్లేదు. నేను నిన్నది అడగనూలేదు ఈ ఊళ్లోవాళ్లంతా కలిసి నీ యావు మీదా నీ మీదా ఎన్నో ఫిర్యాదులు చేసేరు. వాళ్ల పొలాలు తినేస్తున్నదని, పంటలు నాశనమై పోతున్నాయనిన్నూ ... ... ఇదిగో పంతులూ ! నీకు చేతనైతే దాన్ని ఎక్కడో దగ్గర గట్టిగా కట్టుకుని జాగ్రత్తగా పెంచుకో లేకపోతే ఏ దూరంగానో తీసుకునిపోయి అమ్మిపారేసుకో. నీ ఇష్టం. అంతేకాని ఇవ్వాల్టి నుంచి నీ ఆవుమీద మళ్ళా ఏవైనా రిపోర్టులు వస్తే నేనసలే మంచిమనిషినిగాను...ముందుగా నీ ఆవును ఏ మాంసం గమేళాకో ఇచ్చేస్తాను. ఆనక ఈ ఊర్నిండి నిన్నూ తగిలేస్తాను... ఆ !!''

అంటూ వాలుకుర్చీలోంచి లేచినించున్నాడు మునసబు. అవధాన్లు కళ్ళవెంబడి కన్నీళ్ళు అలుముకున్నాయి. దెబ్బతిన్న పక్షిలా గిలగిల్లాడుతూ భారంగ అడుగులు వేస్తూ కదిలేడు.

అతను గేటు దాటేవరకూ చూసేడు మునసబు.

''ఒరే !... ఆ ఆవుగల పంతుల్ని పిలిపించి గట్టిగా చీవాట్లు పెట్టేనని యిందాక మనకు ఫిర్యాదు చేసిన వాళ్ళందరితోనూ చెప్పు. లేకపోతే ఈ ఊరికి మునసబునై ఉండికూడా ఏటీ చెయ్యలేదని నామీద 'ఆళ్ళు ఏడుస్తారు... వెళ్ళు.'' అన్నాడు బారికాడు వెంకడిని ఉద్దేశించి.

''అలాగేనండి బాబయ్యా... ఇదిగో యిప్పుడే ఎల్తున్నానండి !'' అంటూ అక్కడినుంచి కదిలేడు వెంకన్న.

* * *

అవధాన్లు మనసు మనసులో లేదు. కన్ను మూసుకున్నా తెరుచుకున్నా మునసబు నాయుడి మాటలే పదే పదే గుర్తుకురాసాగేయి. ఎంత మరిచిపోదామన్నా, వెంటాడుతూనే ఉన్నాయా మాటలు.

''ఛి . ఛీ... వెధవబ్రతుకు. బ్రాహ్మణ పుట్టుక పుట్టి, అంతలేసి మాటలు అనిపించుకు బ్రతక్కపోతే ఏ చెఱువులోనో పడి చావ గూడదూ ? ?'' అంతరాత్మ తిట్టింది కాస్సేపు.

''రామ...రామ... ఎంతెంత మాటలన్నాడని ?'' ఆ మాటలన్నీ వినికూడా తనింక బ్రతికే ఉన్నందుకు అవధాన్లుకు చాల బాధ కలిగింది. ఆ వెంటనే ఆవూ గుర్తుకొచ్చింది. లేచి ఆవును సమీపించాడు.

''పిచ్చిముండ ! ఆకలేస్తే నేను చాతకాని వాణ్ణయిపోయానని గ్రహించి ఊరివాళ్ళ పొలాల మీద పడ్డావు. ఇప్పుడు వాళ్ళందరూ నీమీదనూ, నామీదనూ కత్తికట్టేరు... ఎలాగే నీతో ??'' అంటూ ఆప్యాయంగా దాన్ని నిమిరేడు.

''ఆసలిదంతా మీ వ ల్ల నే వచ్చింది.'' అవధాన్లు భార్య అంతెత్తున లేచింది భర్తమీద.

''అవునే... నావల్లనే వచ్చింది. నోరులేని ఈ జీవానికి కడుపు నిండా యింత తిండి పెట్టలేని నా చాతకానితనం వల్లనే గదా యిది ఊరి వాళ్ళ పొలాలమీద మేస్తోంది?... ఆకలే... ఆకలి. మనుష్యులమైతే నోరు విడిచి అడుగుతాం, కాని నోరులేని ఈ పశువుకేం తెలుస్తుంది ?''

తల పట్టుకున్నాడు అవధాన్లు.

''అలా తల పట్టుకుంటే ఏమీ జరగదు. ముందు ఏదో ఒకటి చేయాలి ...'' సలహా యిచ్చింది భ్రమరాంబ.

''అవును... ఏదో ఒకటి చేయాలి ...'' అంటూ ఆలోచనలో పడ్డాడు అవధాన్లు. ఇలా ఉండగనే బయట చీకట్లు దట్టంగా క్రమ్ముకున్నాయి.

ఆవు ఆలోచనలతో రాత్రంతా కలత నిద్దర పోయాడు పాపం అవధాన్లు.

* * *

ఉదయం లేచీ లేవడంతోటే బ్రహ్మాండమైన ఆ లో చ న తట్టింది అవధాన్లుకు. హుషారుగా ప్రక్కమీద నుంచి లేచేడు. ఇన్నాళ్ళుగా, యిన్నేళ్ళుగా ఈ ఆలోచన రాక ఆవు గురించి అనవసరంగా తలకాయ బ్రద్దలు కొట్టుకున్నందుకు, ఊరి వాళ్ళందరి చేత వెధవ మాటలు అనిపించుకున్నందుకు సిగ్గుపడ్డాడు.

ఆలస్యం చేయకుండా భార్య భ్రమరాంబ చెవిలో వేసేడు. ఇన్నాళ్ళుగా భర్త తెలివితేటల మీద పెద్దగా నమ్మకంలేని ఆవిడ ఎంతో సంబరపడిపోయింది.

''ఇది చాల బాగుందండోయ్ ! మీ ఆలోచన బ్రహ్మాండంగా ఉంది. మీదీ తెలివైన బుర్రే.'' మెచ్చుకోలుగా అంది భ్రమరాంబ.

''అవునే... అలా చేస్తే ఈ ఊరివాళ్ళ బాధ తప్పుతుంది. ఆవు కడుపునిండా యింత మేతా దొరుకుతుంది. ఆపైన మ న కెం తో పుణ్యం వస్తుంది. అసలు దానం చేయడంవల్ల ఎంత పుణ్యం వస్తుందో పూర్వీకులు లెఖ్ఖలు గట్టి మరీ చెప్పేరు. ఈ బొందిలోంచి జీవి వెళ్ళిపోయేక వైతరిణి నదిని సునాయాసంగా దాటెయ్యడానికి ఆవు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పేరు పెద్దలు.''

దానం

మురిసిపోయాడు అవధాన్లు కాస్సేపు కానీ ఆ వెంటనే మరో సమస్య

అసలీ యావును ఎవరికి దానం చెయ్యాలీ యని ? యాయవారం చేసుకునే ఏ బీద బ్రాహ్మడికో దానం ఇస్తే. తను తిండానికే యింతన్నం దొరక్క అతనేడుస్తుంటే ఆవుకు మేత ఎక్కడినుంచి తెస్తాడు ? పోనీ దారంట బోయే ఏ దానయ్యకో దానంచేస్తే ? అమ్మో !! వాడు పెంచలేక ఏ కసాయి గమేళా వాడికో యిచ్చేయగలడు ఆ వెనక కసాయివాడు దాన్ని ముక్కలు ముక్కలుగా నరికి..

ఇక ఆపై ఆలోచించడానికి ధైర్యం చాల్లేదు అవధాన్లుకు "పోనీ ఏ దేవస్థానం వాళ్ళకో దానం చేసేద్దాం దేవుడికిచ్చినట్లూ వుంటుంది, పైగా బోల్డంత పుణ్యం కూడ వస్తుంది..." భార్య భ్రమరాంబ యిచ్చిన ఈ సలహా చంకలో కితకితలు పెట్టినట్టయింది.

"నువ్వు యిక్కడుండవలసిన మనిషిగావు ఏ ప్రధానమంత్రి దగ్గర పి. యే గా ఉండాల్సిన దానివి సుమా !!" అంటూ భార్యను మెచ్చుకుని, ఆ రోజే తమకు బాగా దగ్గర్లోనేగల ఓ ప్రముఖ దేవస్థానంవారికి ఉత్తరం వ్రాసేడు అవధాన్లు.

* * *

ఓ నాల్రోజుల తరువాత దేవస్థానం వారి నుంచి ఓ సమాధానం అందింది అవధాన్లుకు అందులో, దేవుడికి ఆవును దానం చేయాలని అనుకోవడం ద్వారానే అతని 'జన్మ' ఎలా తరించిపోయిందో వివరిస్తూ, ఆవును తెచ్చి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగార్ని కలుసుకొమ్మని వుంది.

అవధాన్లు సంతోషానికి పగ్గాలు లేవు

తన వంశం, తన జన్మ ఈ ఉత్తమ 'గోదానం' వల్ల తరించిపోయిందనుకున్నాడు ఆ వెంటనే దేవస్థానం వారికో ఉత్తరం వ్రాస్తూ, గోదానం అనేది ఉత్తమమైన శుభకార్యం కాబట్టి ఎప్పుడు రమ్మనేదీ వ్రాస్తే ఆ రోజు సతీసమేతంగా, గోవును తీసుకుని దేవస్థానంకు రాగలవాడనని, ఏ విషయమూ లేఖ వ్రాయమని వ్రాసి పోస్టు చేసేడు

అవధాన్లు తన ఆవును దానం ఇచ్చేస్తున్నట్లుగా అందరికీ తెలిసిపోయింది అందరూ అతన్నిప్పుడు పొగిడేవాళ్ళే

"గోదానంవల్ల నీ కుటుంబం తరించి పోతుందోయ్ !!"

తెలిసిన పంతులు ఒహోయన పలకరించేడు

చిర్నవ్వు నవ్వేడు అవధాన్లు

"అటు ఏడు తరాలూ — ఇటు ఏడు తరాలూ నీ గోదానంవల్ల పుణ్యలోకాలు పొందుతారు." ఇంకొకాయన అన్నాడు

అందుకూ చిరునవ్వే సమాధానం అవధాన్లు నుంచి

"అసలీ గోదానంవల్ల యింత పుణ్యం వస్తుందని యింతకుముందే తెలిసుంటే ఈపాటికే దానం చేసి ఉండేవాళ్ళం గదూ !! ?"

అవధాన్లు భార్య భ్రమరాంబ అంది

దానికీ అవుననే తలూపేడు అవధాన్లు

"ఏవండోయ్ ! మనం చెయ్యబోయే ఈ గోదానంవల్ల వచ్చే పుణ్యం మీకెంత వస్తుందో మీ భార్యగా నాకూ అంతే వస్తుందిట సగం మీకూ — సగం నాకూనూ" మళ్ళీ అందావిడ చిర్రెత్తింది అవధాన్లుకు

"సగం కాకపోతే ఈ పుణ్యం పూర్తిగా నువ్వే తీసేసుకో, నాకేమీ అక్కర్లేదు." కసురుకున్నాడు అతని మనసు దేవస్థానం వారు ఉత్తరం ఎప్పుడు వ్రాస్తారా, ఎప్పుడు వెళ్లి శాస్త్ర ప్రకారంగా తన ఆవును దానం చెయ్యాలాని ఆలోచిస్తోంది రాబోయే ఆ ఉత్తరం కోసమే చూడసాగేడు అవధాన్లు

* * *

ఆ రోజు ఉదయాన్నే యధావిధిగా అన్ని పనులూ పూర్తిచేసుకుని పంచాంగం చేతోపట్టుకుని వీధి అరుగు మీద కూర్చునేసరిక్కి సుమారుగా పదకొండు కావచ్చింది అవధాన్లుకు. భ్రమరాంబ లోపల ఏదో పనిలో వుంది.

దీక్షగా పంచాంగం చూస్తున్న వాడల్లా ఎదురుగావచ్చి నించున్న మనిషి వేపు చూసి తొట్రుపడ్డాడు

"దండాలండీ పంతులుగోరూ...దండాలు" వినయంగా వంగి దండం పెట్టేడు జారికాడు వెంకన్న

పొద్దున్నే ఈ ఛండాలపు వెధవ బోణి తగిలిందేవిటాని ఆశ్చర్యపోయాడు అవధాన్లు

"ఈడేటి పొద్దున్నె ఎలిపొచ్చేవాడను అనుకుంతన్నారా బాబూ ? ?" మనసులో మాటను పసిగట్టేసట్లు అంటున్న వాడికేసి తొట్రుబాటుగా చూస్తూ —

'అబ్బే అదేంలేదురా వెంకా !! ఏదో పంచాంగం పనో, లేక జాతకం పనో, ఉండి ఉంటుందని భావిస్తున్నానే ! "

నర్దుకుని నవ్వుతూ అన్నాడు అవధాన్లు

"ఇయ్యి మీకిచ్చేమని మనూరి మునసబు నాయుడుగోరు సెప్పినారండీ !" బొడ్లొంచి రూపాయల కట్టొకటి తీసి అన్నాడు వెంకన్న ఆశ్చర్యం వేసింది అవధాన్లుకు

"మునసబు గారిమ్మన్నారా ? ఏవిట్రా విశేషం ?"

ఆ డబ్బును చూస్తూ అన్నాడు అవధాన్లు

"ఇసేసమేటుంటదండి పంతులుగోరూ ? అక్కడికీ నట్టవే వచ్చినాదండి. అయినా అన్నకాడికి మీ ముకం సూసి తెచ్చినానండి . నాను మాటంటే అంతా కరక్టండి "

చేతులు కట్టుకుంటూ అన్నాడు వెంకన్న

అవధాన్లుకు అసలు మునసబు నాయుడు డబ్బెందుకు పంపేడో వీడికి నష్టం రావడమేమిటో బోధపడలేదు

"ఒరే ! మునసబు గారికేమైనా నాతో పని బడిందా ? ఎప్పుడు రమ్మన్నారు ? ఏవిటి వాళ్ళిట్లో విషయం ?"

కళ్లమీద ప్రశ్న గుప్పించి అడుగుతున్న

ఇటీవల 'సాహితీ మిత్రులు' ఏర్పాటు చేసిన 'నా ఉదయం' కావ్యావిష్కరణ సభలో కవి శ్రీ నాగభైరవని ఇంటర్‌మీడియేట్ బోర్డు కార్యదర్శి శ్రీ కె పెంచలయ్య సన్మానిస్తున్న దృశ్యం ఆవిష్కర్త కళా ప్రపూర్ణ శ్రీ తుమ్మలవారినికూడా చిత్రంలో చూడవచ్చు

దానం

అవధాన్లు వేపు వెర్రిముఖం వేసి చూసె వెంకన్న.

"అసలు యిసయం మీకు తెలినట్లే బారికోణ్ణి నన్నడుగుతున్నారేటి బాబయ్యా ? మరీ ఆశ్చర్యంగా అన్నాడు వాడు.

"ఒరే... ఈ పంచాంగం తోడు. నా నిజంగా ఏమీ తెలీదు. విషయం ఏమిటో ఒక్క ముక్కలో చెప్పేద్దూ, బాబ్బాబూ !!!" దీనంగా బతిమాలుతున్నట్లుగా అడిగేడు అవధాన్లు

వాడికాశ్చర్యం, అయోమయం రెండు కలిగేయి

"రెండ్రోజుల కితవే మీ యావు మా మునసబు నాయుడుగోరి పొలంలోపడి ఆ పెసరసేను పూరాగా మేసేసి, తొక్కేసినాదంట మునసబుగోరు అగ్గయిపోయారాయేల నిన్న రాత్రి అది ఊరిలో ఎక్కడో తిరుగుతా కనిపిత్తే అట్టుకుని నాక్కబురు అంపినారండి పాతిక రూపాయలకి బేరం అయినాదండి .. ఇయ్యాల తెల్లారబోతలకే గమేలాతో ఏసేసినావండి ఇరవై వొచ్చిందండి మొత్తం అయిదూనట్టమే నమకోండి అయినా మనూరు మునసబుగోరు గదాని మాట్లాడకుండ పాతిక రూపాయలూ యిచ్చేయబోయానండి అరు ఆ ఎమ్మటే "ఒరే ! ఎదవా ! అది పరాయిసొమ్ము, నాకిత్తానంటావేటి ? ఎల్లి ఆ పంచాంగం పంతులుగోరి కిచ్చేసిరా !!" అన్నారండి అంతేనండి సొమ్మట్టుకుని మీ కిచ్చేదావని ఒచ్చినానండి .. తీసుకుండి బాబయ్యా !!"

వెంకన్న మాటలతో అవధాన్లు గుండె లొక్కసారిగా బద్దలైపోయాయి పట్టరాని ఆవేశంతో పిడికిళ్ళు బిగుసుకున్నాయి ఏదో కోపం — ద్వేషం, పగ — ఒళ్ళంతా వ్యాపించింది కాని, అంతలోనే తన స్థితి గుర్తుకొచ్చింది కోపం స్థానే దుఃఖం కట్టలు తెంచుకుంది. ఉరకలు పెడుతూ పొంగుతున్న మహాసముద్రంలా ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు

"ఒరే !! వెంకా ! ఆ సొమ్ము నాకెందుకురా ? నాకు వద్దు అది అతనికే ఇచ్చెయ్యి ఊరివాళ్ళ రక్తమాంసాలు పిండి సంపాదిస్తున్నది చాలక, ఊళ్ళోని నోరులేని పశువుల రక్తమాంసాలూ కావలసివచ్చాయి ఆయనకి అవీ పిండుకుని తినేస్తున్నాడు

ఒరే ! వెంకా !! మునసబుగారి ఆకలికి నా ఆవు చాలకపోతే, నేనూ సిద్ధంగా ఉన్నానని చెప్పరా ! నాలాటి బడుగువాసి రక్తమాంసాలు కూడా తినేసి మరికొన్ని సంవత్సరాలపాటు సుఖంగా బతకమని చెప్ప చెప్పరా వెళ్ళి చెప్ప !!"

అవధాన్లు గొంతు యిక పెగల్లేదు. మనిషి దుఃఖంతో విరుచుకుపడిపోయాడు. ★